

...22వ పేజీ తరువాయి

డబ్బును నేరుగా ట్రావెల్ ఏజెంట్‌కు పంపాం' అని లాదర్-రిచ్‌మండ్ తెలిపారు. న్యూయార్క్‌లో ఒక మోస్తరు వివాహానికి 40 వేల డాలర్ల మేరకు వ్యయం అవుతోంది. తరచు ఇది వధూవరులకు, వారి తల్లిదండ్రులకు భరించలేని స్థాయిలో ఉంటున్నది.

వెస్లీ పురియర్, వాలెరీ హెర్నాండెజ్ గత ఆగస్టులో తమ వివాహానికి 51 వేల అమెరికన్ డాలర్ల వరకు ఖర్చు చేయగలిగారు. అయితే, వారు సగానికి సగం ఖర్చును రాబట్టుకోవడానికి అతిథుల వద్ద నుంచి 150 అమెరికన్ డాలర్ల వరకు స్వీకరించారు. వెల్స్ ఫార్గో బ్యాంకు 'విషింగ్ వెల్' (శుభాకాంక్షలు) సర్వీసును ప్రారంభించింది.

'డిష్‌లు, వాల్ హాంగింగ్‌ల కోసం రిజిస్టర్ చేసుకోవడానికి బదులు అసలు పెళ్ళి ఖర్చులో కొంత భారాన్ని మీ అతిథు లను భరించవలసిందిగా కోరండి' అని బ్యాంకు సలహా ఇస్తోంది. అయితే, మర్యాద వ్యవహారాలకు సంబంధించిన అమెరికన్ ఎక్స్‌పర్ట్ పెగ్గీ క్షమించరాని దుందుడుకుతనం అని విమర్శిస్తున్నారు. వివాహ వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకోవాలని జనం అభిలషిస్తుంటారు కాని అందుకయ్యే ఖర్చును భరించజాలరని న్యూయార్క్ ఫొటోగ్రాఫర్ ఫదీ ఖైర్ అంటున్నారు. 'సాయం అందించవలసిందిగా స్నేహితు లను కోరడం ఒక పద్ధతి. తమ కానుకలను వెనుకకు తీసుకుని నగదు పొందడం కన్నా అది వేరేమీ కాదని నా భావన' అని ఖైర్ అన్నారు. కాగా, ఈ ధోరణి ప్రస్తుతం బ్రిటన్‌లో కూడా విస్తరిస్తున్నది. ఒక బ్యాంకుకు సంబం ధించిన ఖాతాదారు వ్యవహారాల సలహాదారుడు ఆండ్రూ చిన్నెక్ (26), లండన్‌కు చెందిన జోడీ డివైన్ (26) ఒక జాయింట్ అకౌంట్ తెరిచారు. అతిథులు ఆ అకౌంట్ ద్వారా తమ 'కానుకలు' చెల్లించవచ్చు. ఈ నగదు పెళ్ళికి ముందు చేసిన అప్పులు తీర్చడానికి ఉపయోగిస్తుంది. 'మాకు కావలసిన గృహోపకరణాలు అన్నీ మా వద్ద ఉన్నా యి. సాధ్యమైనంత తక్కువ రుణ భారంతో మా కొత్త జీవితం ప్రారంభించడమే మాకు కావలసింది' అని చిన్నెక్ చెప్పింది. ✧



## పెళ్లి కబుర్లు అంతా గ్యాసే...

పుట్టింది ముంబాయిలో అయినా, పెరిగింది దుబాయ్‌లో అయినా స్నేహ తల్లితండ్రులు మాత్రం రాజమండ్రికి చెందినవారు. తెలుగు పిల్ల అయిన స్నేహను మొదట హీరోయిన్‌గా గుర్తించింది మలయాళ సినీపరిశ్రమే. మలయాళ దర్శకుడు ఫాజిల్ దుబాయ్ వెళ్ళినప్పుడు ఆమెను చూసి మలయాళ చిత్రంలో అవకాశం ఇచ్చాడు. తరువాత స్నేహ ప్రతిభను గుర్తించిన తెలుగు, తమిళ నిర్మాతలు ఆమెను తమ చిత్రాల్లో నటించేందుకు అవకాశం ఇచ్చారు. పాశ్చాత్యదుస్తులతో కనిపించే స్నేహ చూడటానికి అమాయకంగా ఆకర్షణీయంగా ఉంటుంది. గ్లామర్‌రోల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వని నటీమణిగా పేరు తెచ్చుకున్న స్నేహ సంప్రదాయ పాత్రలను పోషించడంలో దిట్టగా పేరు తెచ్చుకుంది. ఆటోగ్రాఫ్ లాంటి చిత్రాల్లో ఆమె నటన ఆమెకు మంచి ఇమేజ్‌ను తీసుకువచ్చింది. స్నేహ పెళ్ళికి అంతా సిద్ధమైందని వరుడు దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త అని పత్రికలు, సినిమా వెబ్‌సైట్‌లలో వచ్చిన వార్తలను స్నేహ ఖండిస్తోంది. అంతా ఒట్టిదే పెళ్ళిలేదని కొట్టి పారేస్తోంది.